క్లుప్తంగా

మురుగునీరు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

భీమారం: బూర్గుపల్లి ప్రధాన రహదారి పక్కనే గల సేవాలాల్ ఆలయం ఎదుట మురుగు నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. ఈ విషయాన్ని అధికారులూ.. ఇటు చూడరూ..! అనే శీర్షికన ఈ నెల 9న 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సర్పంచ్ వడ్లకొండ రమాదేవితో పాటు అధికారులు స్పందించి పంచాయతీ సిబ్బందితో మురుగు నీరు, బురదను తొలగింపజేసి, మట్టి పోయించి శుభ్రం చేయించారు. ఈ మేరకు గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

'హైవే బాధితులకు అండగా ఉంటాం'

లక్సెట్టిపేట: జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ అన్నారు. స్థానిక ఐబీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నూతనంగా నిర్మించే 63వ జాతీయ రహదారి ఆర్మూర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే దారి వల్ల పట్టణంలో చాలా ఇళ్లు కోల్పోతున్నారన్నారు. తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని, రోడ్డును బైపాస్‌గా వేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్డును నిర్మించొద్దని కోరారు. బాధితులకు అండగా ఉంటూ, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు ఎండీ ఆరీఫ్, నాయకులు నవాబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఈ నెల 13న గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో డెలివరీ ఎక్జిక్యూటివ్ 200ఉద్యోగాల కోసం ఎస్సెస్సీ పాసై, 45సంవత్సరాల వయస్సు ఉన్న అభ్యర్థులు ఉద్యోగాల ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికై న అభ్యర్థులు హైదరాబాద్, మంచిర్యాల పరిసర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, అర్హత సర్టిఫికెట్‌లతో హాజరుకావాలన్నారు.

ప్రత్యేక అధికారిగా బాధ్యతల స్వీకరణ

భీమిని: మండలంలోని లక్ష్మీపూర్, పెద్దపేట గ్రామాలకు ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ ఎస్.కె.సబ్దర్‌అలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2018 నుంచి 2023వరకు లక్ష్మీపూర్, పెద్దపేట గ్రామాల్లో సర్పంచ్ పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. అయితే ఇప్పట్లో మళ్లీ పాలకవర్గం అవకాశాలు లేకపోవడంతో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీడీఓను నియమించింది.

'కంటి వెలుగు' ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పాతమంచిర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య ప్రారంభించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్ కిషన్, రాజన్న, గురువయ్య పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని కొల్లూరులో సోమవారం రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ సురేఖా ప్రారంభించారు.

భీమారం: మండలంలోని మద్దికల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ బుక్యా తిరుమల, మండల వైద్యాధికారి శ్వేత ప్రారంభించారు.

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ జాడి గంగాధర్ సోమవారం ప్రారంభించారు.

ఉత్పత్తి, ఉత్పాదకతకు సహకరించాలి



మాట్లాడుతున్న జీఎం మోహన్‌రెడ్డి

మందమర్రిరూరల్: కేకే–ఓసీలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఏరియా జీఎం మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఓసీని సందర్శించిన ఆయన అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు రక్షణపై అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, మేనేజర్ కుష్వా, సంక్షేమాధికారి సత్యనారాయణ అధికారులు ఉన్నారు.

పట్టాలెక్కిన ఇళ్లు

- నెరవేరుతున్న బెల్లంపల్లి వాసుల దశాబ్దాల కల
- ఇళ్ల స్థలాలకు పట్టాల పంపిణీ ప్రారంభం



ఇళ్ల పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్

బెల్లంపల్లి: కార్మికక్షేత్రం బెల్లంపల్లి మున్సిపాలిటీలో స్థిర నివాసాలు కట్టుకున్న ప్రజలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. దశాబ్దాల నుంచి ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న చిరకాలవాంఛ తీరబోతుండటంతో పుర ప్రజల్లో సంబురం అంబరాన్నంటుతోంది. బొగ్గు గనుల పుట్టుకతో 1926లో బెల్లంపల్లి ఆవిర్భవించింది. బ్రతుకుదెరువు కోసం పల్లెలను విడిచి సింగరేణి ఉద్యోగం కోసం, ఉపాధి కోసం ప్రజలు వలస వచ్చి జీవిస్తున్నారు. సింగరేణి కంపెనీ లీజు భూమిని, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కార్మికులు, కార్మికేతరులు, పేద ప్రజలు శాశ్వత కట్టడాలను నిర్మించుకున్నారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్రజలు కట్టుకున్న పక్కా గృహాలకు, ఇతర కట్టడాలకు పట్టాలు లేకుండా ఉన్నాయి.

అసెంబ్లీలో ప్రస్తావించడంతో..
సీఎం స్పందించి..

కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు లేకుండా ఉన్నాయని ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా పలుమార్లు ప్రస్తావించడంతో సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేకంగా జీవో నంబర్ 76ను జారీ చేశారు. జీవో ఆధారంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న దాదాపు 7వేల మందికి పైగా ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తొలి విడతగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, కలెక్టర్ బాదావత్ సంతోష్, ఆర్డీవో కె.శ్యామల దేవి ఇతర ప్రముకుల చేతుల మీదుగా సోమవారం స్థానికులు ఇళ్ల పట్టాలు అందుకున్నారు. తొమ్మిదిన్నర దశాబ్దాల కల నెరవేరడంతో పురప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్ల పట్టాలు అందుకున్న పలువురిని 'సాక్షి' పలకరించగా సంతోషం వ్యక్తం చేశారు. ఆ ఆనందం వారి మాటల్లోనే....

పట్టాలు వస్తాయనుకోలేదు..



బొగ్గు బాయిలు పుట్టినప్పటి నుంచి బెల్లంపల్లిలో ఇళ్లు కట్టుకుని ఉంటున్నం. మేము కట్టుకున్న ఇళ్లకు పట్టాలు ఇప్పించి భూమి మీద హక్కులు కల్పించాలని ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అసలు ఇళ్ల పట్టాలు వస్తాయనుకోలేదు. ఆశలు వదులుకున్నం. ఇప్పటి సర్కారు పట్టాలు ఇయ్యడానికి ముందుకు రావడం మాకెంతో సంతోషంగా ఉంది.

– దుర్శెట్టి మల్లమ్మ, లబ్ధిదారు

కల నెరవేరింది



ఎవరికైనా కట్టుకున్న ఇంటికి ఇళ్లపట్టా ఉండాలని కోరుకుంటరూ. నేను సుత గట్లనే పట్టాలు ఇయ్యాలని కోరుకున్న. పట్టాలు ఇస్తమని ప్రచారం జేసి చెప్పిండ్లు. గట్లనే ఇంటిపట్టా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు జేసినా.. ఇంటికి వచ్చి సార్లు ఇసారం జేసి, ఇంటి కొలతలు తీసుకున్నరు. గంత జేసినా పట్టాలు ఇస్తారా అని అనుమానపడ్డా. కానీ ఇప్పుడు పట్టా ఇచ్చేసరికి నా కల నెరవేరింది.

– జంగపల్లి భాగ్యలక్ష్మి, లబ్ధిదారు

హక్కుదారులమైనమ్...



మున్సిపాలిటీల నివాసం ఉంటున్న మాకు ఇళ్లు ఉన్న మాటే కానీ ఇంత కాలం ఆ ఇంటి జాగ మీద ఎలాంటి హక్కు లేదు. మున్సిపాలిటీకి ఆస్తిపన్ను కట్టిన భూమికి పట్టాలు లేక అనేక విధాల నష్టపోయినం. సింగరేణోళ్లు వచ్చి ఇళ్లను కూలగొడ్తరేమో అని భయపడ్డం. ఇంతట్లనే ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నం. ఇప్పుడు మాకు ఇంటి పట్టా ఇవ్వడంతో మా ఇంటిపై మేము హక్కుదారులమైనమ్. ఈ ఆనందం మాటల్లో చెప్పలేను.

– బుర్ర లావణ్య, లబ్ధిదారు

రహదారి పనులు ఇరువైపులా చేపట్టాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్: హాజీపూర్ మండలం నుంచి వెళ్తున్న జాతీయ రహదారి 63రోడ్డు విస్తీర్ణం భాగంగా ముల్కల్ల గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా భూమి సేకరించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు గ్రామస్తులు కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో రోడ్డు విస్తరణ ఒకే దిక్కు పనులు చేపడుతుండడంతో ఇళ్లు కోల్పోయి చాలా నష్టపోవాల్సి వస్తుందని, ఇప్పుడు ఉన్న రోడ్డుకు ఇరువైపులా సమానంగా వెడల్పు చేసి, అందరికీ సమాన న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు దర్వాజ రవీందర్, మామిడాల మల్లేష్, ముదం శంకర్, కోలా వెంకటేష్, గుమ్మల భూమయ్య, రాజేందర్, రామిట్ల లక్ష్మి, లావణ్య, రాజు, లలిత, సీపీఐ నాయకులు అంజి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



ముల్కల్లలో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్ కింద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. అనంతరం ముల్కల్ల గ్రామంలో రూ.20లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టే అంగన్‌వాడీ భవన ఆధునీకరణ పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. బుద్ధిపల్లికి చెందిన యువత బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, రైతుబంధు మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీఎం

కాసిపేట: నూతనంగా బాధ్యతలు తీసుకున్న మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి సోమవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని కేకే ఓసీపీ ముంపు గ్రామమైన దుబ్బగూడెంకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ బెనిఫిట్స్, భూసేకరణ గురించి కలెక్టర్‌కు వివరించారు. ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన పీడీఎఫ్‌లను పరిశీలించి త్వరగా చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

చెన్నూర్: నిరుద్యోగులను ఆదుకోవాలని, టీఎస్‌పీఎస్సీ బాధితులను న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ముట్టడికి యువజన కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. పార్టీ పిలుపులో భాగంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో చెన్నూరి శ్రీధర్, బుర్ర కృష్ణ, జూల లక్ష్మణ్, బొడ్డు రాకేశ్, మహేశ్, నాగరాజు, సుమన్ తదితరులు ఉన్నారు.

'అరెస్టులు సరికాదు'

మంచిర్యాలఅర్బన్: సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉంటే మంచిర్యాలలో ఏబీవీపీ నాయకులను ముందుస్తు అరెస్ట్ చేయటాన్ని ఆ సంఘం జిల్లా కన్వీనర్ బొప్పు సతీస్ తీవ్రంగా ఖండించారు. చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియెంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు.



దండేపల్లి: ఐకేపీ వీఓఏల ర్యాలీ



కోటపల్లిలో వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు



లక్సెట్టిపేట: వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- మండలకేంద్రాల్లో ర్యాలీలు, నిరసనలు
- ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేత
- సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

కోటపల్లి/దండేపల్లి/లక్సెట్టిపేట/తాండూర్/వేమనపల్లి/జైపూర్/నెన్నెల: సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు జిల్లా వ్యాప్తంగా పలు మండలకేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మండల కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. 20సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకుంటామని ప్రభుత్వం తమ శ్రమను గుర్తించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ అమలు చేయాలని, అర్హత కలిగిన వీవోలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, ఎస్‌ఎస్‌జీలకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాల వడ్డీ రాయితీ కూడా ఇవ్వాలన్నారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వీవోఏల సమస్యలను త్వరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.



తాండూర్: వినతి పత్రం అందజేస్తున్న వీఓఏలు



వేమనపల్లి:ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన



నెన్నెల:ధర్నా చేస్తున్న వీఓఏలు

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్
- జన్నారంలో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న గంగాధర్‌గౌడ్

జన్నారం: ఏ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి ఒక్క బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. స్థానిక పైడిపెల్లి గార్డెన్‌లో సోమవారం జన్నారం మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో రోడ్లు, తాగునీటి అవసరాలతో పాటు, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి గ్రామాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాలు, పేదింటి ఆడపిల్లల వివాహాలకు కల్యాణ లక్ష్మిలాంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పార్టీ కోసం కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి, మూడోసారీ అధికారంలోకి తేవాలన్నారు. సమ్మేళన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పద్మ, వైస్‌ఎంపీపీ వినయ్‌కుమార్, స్థానిక సర్పంచ్ భూమేష్, పార్టీ మండలఅధ్యక్షుడు రాజారాంరెడ్డి, ప్రధానకార్యదర్శి జనార్దన్, మహిళా అధ్యక్షురాలు సుశీల, కాంతామని, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌ఆలీ, పీఏసీఎస్ చైర్మన్లు రమేష్, రాజన్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రియాజొద్దీన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగాధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ గైర్హాజరు..

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీపీ సరోజ, జెడ్పీటీసీ చంద్రశేఖర్ డుమ్మా కొట్టారు. ప్రతి మండలంలో నాలుగు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ ఆదేశాలున్నాయి. దీంతో జన్నారం మండలంలో ఇప్పటివరకు రెండు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ, ఈ రెండింటికీ వారిద్దరు హాజరుకాకపోవడం బీఆర్ఎస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని పక్కన పెట్టి, నామినేటెడ్ పదవుల్లో కొనసాగుతున్న వారికే పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడంతోనే, ఆ ఇద్దరూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోండి



భీమారంలో దరఖాస్తు అందజేస్తున్న రైతు



చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో..

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ ప్రజావాణిలో మండలంలోని కిష్టంపేటలో రోడ్లకు సంబంధించిన ఒక్క ఫిర్యాదు వచ్చింది. మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఏవో కవిత, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమారం: సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ వెళ్లకుండా ప్రజావాణికి రావాలని కోరారు. ఇందులో ప్రత్యేకాధికారి చిన్నయ్య, ఎంపీవో సతీష్‌రెడ్డితోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

నెన్నెల: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తేవడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ బెల్లంపల్లి సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి రూ.11300కోట్లు కేటాయించి హైదరాబాద్‌లో పనులు ప్రారంభించిన పీఎం మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ స్వశక్తికరణ్ అభియాన్‌లో భాగంగా నెన్నెలలో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సాంబమూర్తిగౌడ్, నాయకులు తోట శ్రీనివాస్, గట్టు రాజయ్యలు పాల్గొన్నారు.

బొట్టు పెట్టి ఆహ్వానం

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆధ్వర్యంలో చెన్నూర్‌లో నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి రావాలని కిష్టంపేటలో ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానం పలుకుతున్నారు.

కస్తూర్బా పాఠశాల సందర్శన

చెన్నూర్: పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను సెక్టోరల్ ఆఫీసర్ పద్మజా సోమవారం సందర్శించారు. పాఠశాల ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె వెంట స్పెషల్ ఆఫీసర్ సుమలత, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

భీమారం: మండలంలోని కాజిపల్లి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం అనుమతివ్వాలని కోరుతూ అంబేద్కర్ యువజన సేవాసమితి జిల్లా ప్రధానకార్యదర్శి గోధారి రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ వాసంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు జాడి రాజన్న, డొంగరి రాజలింగు, ప్యాగ సంతోష్ ఉన్నారు.

దేవునిగూడలో స్వచ్ఛభారత్ మిషన్

జన్నారం: మండలంలోని దేవునిగూడలో స్వచ్ఛ భారత్ మిషన్ పై మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా సర్వే నిర్వహించి, గ్రామ సామాజిక చిత్రాన్ని గీశారు. ఎంపీడీవో అరుణారాణి పాల్గొని మాట్లాడారు.

అంబేద్కర్ జయంతి నిర్వహణపై సమావేశం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై దళిత సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ నెల 14 అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, గ్రామగ్రామాన ఆ మహనీయుడికి ఘనంగా నివాళి అర్పించేలా దళిత సంఘాల నాయకులు పనిచేయాలన్నారు.

జైపూర్: ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పండుగలా నిర్వహించాలని నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టాల నాగరాజు తెలిపారు. మండల కేంద్రంలో పలు కుల సంఘాలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ జయంతిని అన్ని గ్రామాల్లో అన్ని కులసంఘాలతో కలిసి వైభవంగా నిర్వహించుకోవాలని కోరారు.

క్రీడా ప్రాంగణానికి భూదానం

నెన్నెల: హైదరాబాద్‌కు చెందిన ఎన్‌వీ జయదేవి, భగీరథ రెడ్డి, శరత్ ఇంద్రారెడ్డి చిత్తాపూర్ గ్రామంలోని క్రీడా ప్రాంగణానికి రూ.30లక్షలు విలువ చేసే రెండు ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చి ఉదారత చాటుకున్నారు. క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు ప్రభుత్వ భూమి లేకపోవడంతో అధికారులకు స్థల సేకరణ సమస్యగా మారింది. ఈ ప్రాంతం అభివృద్ధికి పాటుపడిన రాజిరెడ్డి కుటుంబీకులను సర్పంచ్ బత్తిని పద్మ సంప్రదించగా భూమి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఎన్‌వీ రాజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి జ్ఞాపకార్థం రెండు ఎకరాల భూమిని గ్రామపంచాయతీ పేరిట పట్టా చేసి ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఉదయం 10గంటలకు కాకతీయ విశ్వవిద్యాలయంలో చదివి డాక్టరేట్ పొంది, అదే విశ్వ విద్యాలయంలో అధ్యాపకురాలిగా పనిచేసిన డాక్టర్ కందాళ శోభారాణి యాది సభను నిర్వహిస్తున్నట్లు సామాజిక కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో పోస్టర్‌ను విడుదల చేశారు.

సీపీఆర్‌పై అవగాహన

భీమిని: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని భీమిని పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.

నర్సరీ సందర్శన

తాండూర్: స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్న నర్సరీని సోమవారం మండల ప్రత్యేక అధికారి గజానంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన మొక్కలను పరిశీలించారు. మొక్కల ఎదుగుదలకు కావాల్సిన ఎరువులను వేయాలని సూచించారు.

ఇఫ్టూ జాతీయ మహాసభల పోస్టర్లు విడుదల

తాండూర్: ఇఫ్టూ జాతీయ 7వ మహాసభల పోస్టర్లను ఆ సంఘం శ్రేణులు సోమవారం విడుదల చేశారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ నాయకులు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. మహాసభలు ఈ నెల 16–18 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరుగుతాయని తెలిపారు. కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయండి

మంచిర్యాలఅర్బన్: పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి 51వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో సోమవారం జార్జిరెడ్డి వర్ధంతి సభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : కృష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899